# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-10-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 5వ జాతీయ జల పురస్కారాలను ఈరోజు ఢిల్లీలో ప్రదానం చేయనున్నారు.**
2. **రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు, రేపు జాతీయ స్థాయి అమరావతి డ్రోన్ సదస్సు జరగనుంది.**
4. **తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా సేవలను విస్తరిస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.**
5. **ఆంధ్రప్రదేశ్‌లో నీటి ప్రాజెక్టులను పూర్తి చేసి వెనుకబడిన జిల్లాలకు సాగు, తాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

==========================

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము 5వ జాతీయ జల పురస్కారాలను ఈరోజు ఢిల్లీలో ప్రదానం చేయనున్నారు. 2023 సంవత్సరానికి గాను ఉత్తమ రాష్ట్రం, ఉత్తమ జిల్లా, ఉత్తమ గ్రామ పంచాయతీ, ఉత్తమ పట్టణ స్థానిక సంస్థ, ఉత్తమ నీటి వినియోగదారుల సంఘం, ఉత్తమ పౌర సమాజం సహా 9 విభాగాల్లో 38 మంది విజేతలను కేంద్ర జల శక్తి మంత్రిత్వ శాఖ ప్రకటించింది. ఉత్తమ రాష్ట్రం కింద ఒడిశాకు మొదటి బహుమతి లభించగా, ఉత్తరప్రదేశ్ రెండవ స్థానంలో నిలిచింది. జాతీయ స్థాయిలో నీటి నిర్వహణ, నీటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారాన్ని చేపడుతున్నామని కేంద్ర మంత్రిత్వ శాఖ తెలిపింది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఉచిత ఇసుక విధానం నిబంధనలను అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని సచివాలయంలో ఉచిత ఇసుక విధానం అమలుపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉచిత ఇసుక విధానాన్ని పారదర్శకంగా అమలు చేయడంతో పాటు లభ్యత పెంచేందుకు సీనరేజి రద్దు చేసినట్లు పునరుద్ఘాటించారు. గ్రామ పంచాయతీల పరిధిలో సొంత అవసరాలకు ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలింపునకు

అనుమతిచ్చామని తెలిపారు. ఇసుక తీసుకెళ్లేవారు గ్రామ, వార్డు సచివాలయాల్లో నమోదు చేయించుకోవాలని చెప్పారు. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అక్రమ తవ్వకాలపై ప్రజలు ఫిర్యాదు చేసేలా సరికొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

రాష్ట్రంలో డ్రోన్ రంగ అభివృద్ధికి దోహదపడేలా అమరావతి డ్రోన్ సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో సదస్సు ఏర్పాట్లపై నిన్న ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, డ్రోన్ సదస్సులో యువత, విద్యార్థులను భాగస్వాములను చేయాలని తెలిపారు. సదస్సులో జరిగే చర్చలు ద్వారా రాష్ట్రాన్ని డ్రోన్ రాజధానిగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. ఎన్ని శాఖల్లో డ్రోన్ల వినియోగానికి అవకాశం ఉందో అంచనా సిద్ధం చేయాలని, డ్రోన్లు వినియోగించే శాఖల అధికారులతో ఒక కమిటీ ఏర్పాటు చేసే విషయాన్ని పరిశీలించాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు.

---------------------------

రాష్ట్రంలో ఈరోజు, రేపు జరిగే జాతీయ స్థాయి అమరావతి డ్రోన్ సదస్సును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు ప్రారంభించనున్నారని ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్ కార్యదర్శి సురేశ్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, విజయవాడ పున్నమి ఘాట్‌లో కృష్ణా నది తీరాన 5 వేల 500 డ్రోన్లతో ఈరోజు ప్రదర్శన నిర్వహిస్తున్నామని చెప్పారు. మంగళగిరిలో జరిగే కార్యక్రమంలో రాష్ట్ర డ్రోన్ ముసాయిదా విధానం ఆవిష్కరిస్తారని పేర్కొంటూ...

వాయిస్ ( 30సెకన్లు)

అలాగే మంగళగిరిలో జరిగే డ్రోన్ సదస్సులో క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో ఒప్పందం జరుగుతుందని, డ్రోన్ కార్పొరేషన్ ఆఫ్ ఏపీ కూడా సర్టిఫైడ్ ఏజెన్సీగా నిలుస్తుందని చెప్పారు. డ్రోన్ కార్పొరేషన్ ద్వారా డ్రోన్ పైలట్ శిక్షణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని సురేష్ కుమార్ తెలిపారు.

---------------------------

తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా సేవలను విస్తరిస్తున్నామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందిచేందుకు అంబులెన్స్ తరహాలో ప్రత్యేక వాహనాలను నిన్న హైదరాబాద్‌లో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వెను వెంటనే పునరుద్ధరించేందుకు ప్రత్యేక వాహనాలను అందుబాటులోకి తీసుకు వస్తున్నామని చెప్పారు. హైదరాబాద్ మహానగర పాలక సంస్థ పరిధిలోని అన్ని డివిజన్‌లలో 24 గంటలపాటు ఈ వాహన సేవలు అందిస్తాయని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లాలో వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి వెనుకబడిన జిల్లాలకు సాగు, తాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో వెలిగొండ, పోలవరం ప్రాజెక్టు, హంద్రీనీవా పనులపై సంబంధిత అధికారులతో మంత్రి దృశ్య మాధ్యమం ద్వారా నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వెలిగొండ ప్రాజెక్టులో మిగిలి ఉన్న పనులపై నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు. రెండో సొరంగంలో లైనింగ్ పనులు, డిస్ట్రిబ్యూటరీల పనుల అంశంపై సమగ్ర నివేదిక అందించాలని మంత్రి ఆదేశించారు.

-------------------------

రాష్ట్రంలో అర్హతగల ప్రతీ కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అమలు చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో గ్యాస్ సిలిండర్ల పథకంపై ముఖ్యమంత్రి నిన్న సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమం అమలులో భాగంగా ప్రతీ నాలుగు నెలల వ్యవధిలో ఎప్పుడైనా ఆయా లబ్ధిదారులకు ఒక ఉచిత గ్యాస్ సిలిండర్ పొందే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈనెల 24 నుండి బుకింగ్ చేసుకునే ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈనెల 31వ తేదీ నుండి సిలిండర్ల పంపిణీని ప్రారంభించనున్నామని తెలిపారు. లబ్దిదారులకు రెండు రోజుల్లో వారి బ్యాంకు ఖాతాల్లో గ్యాస్ రాయితీని జమచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

-------------------------

రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. ఖమ్మం జిల్లాలోని గుర్రాలపాడులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో ఈ సారి 40 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారని తెలిపారు. సీసీఐ ప్రకటించిన మద్దతు ధర ప్రకారమే వ్యాపారులు ప్రత్తి కొనుగోళ్లు చేపట్టాలన్నారు. రైతులను మోసం చేస్తే దళారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు, ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. పత్తి, మిర్చి స్థానంలో పామ్ ఆయిల్ చెట్లను సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మంత్రి వివరించారు.

-------------------------

తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఈరోజు వాయుగుండంగా మారే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. ఇది పశ్చిమ బంగాల్, ఒడిశా తీరం వైపు కదులుతూ ఈ నెల 24న వాయువ్య బంగాళాఖాతంలో తుపానుగా మారుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తర కోస్తాజిల్లాలలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. తుపాన్‌గా ఏర్పడిన తర్వాత ఈ నెల 24, 25 తేదీల్లో కోస్తాంధ్రపై ప్రభావం చూపుతుందని, సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు వెనక్కి రావాలని అధికారులు సూచించారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

మరోవైపు తెలంగాణలోనూ రానున్న రెండ్రోజులపాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని

హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.

---------------------------

వాస్తవాధీన రేఖ–ఎల్ఏసీ గస్తీకి సంబంధించి భారత్–చైనా దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ఢిల్లీలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, ఇరుదేశాల మధ్య జరిగిన విస్తృత చర్చల ఫలితంగా తూర్పు లద్దాఖ్ లోని సరిహద్దు ప్రాంతాలలో గస్తీ ఏర్పాట్లపై ఒప్పందం కుదిరిందని అన్నారు. గత కొన్ని వారాలుగా దౌత్య, సైనిక సంధానకర్తలు జరుపుతున్న చర్చల ఫలితంగా ఈ పురోగతి చోటుచేసుకుందని మిస్రీ తెలిపారు.

========================